సెమీ ఫైనల్‌లో కెసిఆర్‌ను ఓడించాం

- ఫైనల్‌లో మోడీని ఓడించాలి
- మీరే నాయకులకు, ప్రజలకు అనుసంధాన కర్తలు
- సోషల్ మీడియా వారియర్స్ సమ్మేళనంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సెమీ ఫైనల్‌గా భావించిన అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్‌ను ఓడించామనీ, ప్రస్తుతం ఫైనల్ మ్యాచ్ అయిన లోక్‌సభ ఎన్నికల యుద్ధంలో మోడీని ఓడించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. నాయకులకు, ప్రజలకు అనుసంధానకర్తగా నిలవాలని వారిని కోరారు. నాయకులు ఎన్ని ఉపన్యాసాలిచ్చినా, ఆ విషయాలు ప్రజలకు చేరవేయడమే ముఖ్యమన్నారు. ప్రజాస్వామ్యంపైన, రిజర్వేషన్లపైన బిజెపి దాడులు చేస్తోందన్నారు. ఎన్నికల కోసం మతాన్ని, ఏజన్సీలను ఉపయోగించుకుంటుందని తెలిపారు. దాన్ని సోషల్ మీడియా ఎదుర్కోవాలని కోరారు. ఇలాంటి విషయాలను సమయస్ఫూర్తితో తిప్పి కొట్టాలని చెప్పారు. 'భగవంతుడు గుడిలో ఉండాలి. భక్తి గుండెల్లో ఉండాలి. కానీ మతాన్ని బహిరంగంగా రెచ్చగొట్టి బిజెపి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోంది' అని ఆయన వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన సోషల్ మీడియా వారియర్స్ సమ్మేళనంలో సీఎం మాట్లాడారు.

ప్రజలకు చేర్చేదే సోషల్ మీడియా

ఎంత పెద్ద విషయమైనా ప్రజలకు చేర్చేదే సోషల్ మీడియా అన్నారు. సామాజిక మాధ్యమం వచ్చాక ప్రతి సెకన్‌కు వార్తలు బయటకు వస్తున్నాయి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి...సమాచారం అందరికీ చేరవేయాలి. దీన్ని వారియర్లు గుర్తించాలి' అని సూచించారు. దాని వల్లనే రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. బిజెపి భావజాలమంతా ఆర్‌ఎస్‌ఎస్ నుంచి వచ్చినదేనన్నారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే వారి విధానాన్ని ఈస్టిండియా కంపెనీ మొదట ప్రవేశ పెట్టి, ఆ తర్వాత క్రమంగా దేశం మొత్తాన్ని ఆక్రమించిందని గుర్తు చేశారు. ప్రధాని మోడీ కూడా బ్రిటీష్ విధానాన్ని పాటించి దేశాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర

ప్రభుత్వాన్ని కూల్చేయాలని చూస్తున్నారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అన్నారు. రేవంత్ ఉంటే తమ ఆటలు సాగబోవనీ, ఆయన లేకపోతే చాలు.. ఎవరైనా ఫర్వాలేదు అనే పరిస్థితికి బిఆర్‌ఎస్ నేతలు వచ్చారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లలో గెలిపిస్తే ఏడాదిలో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ అంటున్నారనీ, అదెలా సాధ్యం? అని ప్రశ్నించారు. ఇక్కడ అల్లాటప్పాగా కూర్చున్నామా? తండ్రి పేరు చెప్పుకొని కుర్చీలోకి వచ్చామా? ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఉద్దేశంతోనే 400 సీట్ల నినాదాన్ని బిజెపి చేస్తోందన్నారు. రిజర్వేషన్లు రద్దు చేసి ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మేసే కుట్ర జరుగుతోందని తెలిపారు.

రుణమాఫీ చేసి తీరుతాం

ఆగస్టు 15న సిద్దిపేటకు శని వదిలిపోతుంది

స్పీకర్ ఫార్మాట్‌లో లేకుంటే రాజీనామా చెల్లుతుందా? అంటూ హరీశ్‌రావును సీఎం రేవంత్ ప్రశ్నించారు. తన మామ చెప్పిన సీస పద్యమంతా రాజీనామా లేఖలో రాసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామన్నారు. స్పీకర్ ఫార్మెట్‌లో హరీశ్‌రావు రాజీనామా లేఖను సిద్ధం చేసుకోవాలని సవాల్ విసిరారు. ఆ రోజు సిద్ధిపేటకు ఆయన శని వదిలిపోతుందని చెప్పారు. రుణమాఫీ చేయలేకపోతే మాకు అధికార మెందుకు? అని ప్రశ్నించారు. దానికి రూ.30-40వేల కోట్లు అవుతుందన్నారు. కాళేశ్వరంలో మీరు దోచుకున్న రూ.లక్ష కోట్ల కంటే అది ఎక్కువా? హైదరాబాద్ చుట్టూ ఆక్రమించుకున్న వేలాది ఎకరాల కంటే ఎక్కువా? అని ప్రశ్నించారు. మోసం చేయాలనుకున్న ప్రతిసారీ ఆయనకు అమరవీరుల స్థూపం గుర్తుకొస్తుందన్నారు.

భారత్ బయోటెక్‌ను సందర్శించిన ఉపరాష్ట్రపతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒక రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాష్ట్రానికి విచ్చేసిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలోని భారత్ బయోటెక్ క్యాంపస్‌ను సందర్శించారు. అందులో తయారయ్యే వ్యాక్సిన్లు, ఇతర ఔషదాలను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. అంతకు ముందు ఉపరాష్ట్రపతికి బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ సిపి.రాధాకృష్ణన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్వాగతం పలికారు. సాయంత్రం రాజ్‌భవన్‌లో కొద్ది సేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం టిటిడి సంస్కృత విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

పరుచూరి రఘుబాబు స్మారక జాతీయ నాటక పోటీలు ఆరంభం

ప్రజాశక్తి - కల్చరల్

రవీంద్ర భారతీ ప్రధాన వేదికపై పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ నాటక నాటిక పోటీలు ఆరంభమయ్యాయి. రంగస్థల ప్రముఖులు ఆచార్య డీ.ఎస్.ఎన్.మూర్తి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న పోటీల్లో సుమారుగా అరు వందల నాటకాలు ప్రదర్శించి ఉంటారనీ, సినిమా పరిశ్రమలో బిజీగా ఉంటూ కూడా పరుచూరి బ్రదర్స్ ఈ నాటకాలను ఓపికగా చూడటం విశేషమని అన్నారు. అధ్యక్షత వహించిన సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ రవీంద్ర భారతిలో నాటకం వేయడం ఒకప్పుడు తన కోరిక అన్నారు. పరుచూరి రఘుబాబు నాటక పరిషత్ ద్వారా ఎందరో కళాకారులు తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం అవుతున్నారని తెలిపారు. పరుచూరి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు నాటక రంగానికి చేయూతనిచ్చేందుకు ఈ నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ కుమారుడు రఘుబాబును పోటీల్లో పాల్గొనే నటీ నటులలో చూసుకుంటున్నానని చెప్పారు. రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ ప్రార్థన గీతంతో సభను ప్రారంభించారు.

మంత్రి కొండాకు ఇసి అక్షింతలు

- కెటిఆర్‌పై వ్యక్తిగత విమర్శలపై ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధంగా మాట్లారంటూ ఎన్నికల సంఘం అగ్రహం వ్యక్తం చేసింది. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై ఈ నెల ఒకటిన వరంగల్‌లో మంత్రి చేసిన వ్యాఖ్యలను ఇసి తప్పు పట్టింది. ఎన్నికల సమయంలో బహిరంగంగా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కమిషన్ హెచ్చరించింది. తమకు బిఆర్‌ఎస్ నేతల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి నుంచి సమాచారం తెప్పించుకుని పరిశీలించినట్టు పేర్కొంది. ఆరోపణలు చేసే సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించింది. స్టార్ క్యాంపెయినర్, మంత్రిగా ఉన్న సురేఖ మరింత బాధ్యతగా ఉండాలని హితవు పలికింది.

హామీలను నిలబెట్టుకోని హరీశ్‌రావు

- చెల్లని పత్రాలతో రాజీనామా లేఖలా?
- పదేళ్ల బిజెపి పాలనలో మెదక్‌కు ఒరిగిందేంటి?
- మాట ఇచ్చి తప్పించుకునేది కాంగ్రెస్ పార్టీ కాదు
- మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉత్త కాగితాలతో హరీశ్ రావు సవాల్ విసరడం కాదని, ముందు మాట మీద ఉండటం అలవాటు చేసుకోవాలని, ఇప్పటికి ఎన్ని సార్లు మాట తప్పావో ప్రజలకు తెలుసని మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణట అమరవీరుల పేరు మీద పదవులు అనుభవించిన మీరు ప్రజల్లో తేల్చుకోవాలని తెలిపారు. ఆగస్టులో నువ్వు నిజమైన రాజీనామా లేఖతో సిద్ధంగా ఉండమని స్పష్టంచేశారు. శుక్రవారం జగదేవపూర్ మండలం దౌలపూర్ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ప్రచారంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం జిల్లా నాయకులు రచమల్ల బంగారు రెడ్డి ఇంటి వద్ద మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపి అభ్యర్థి నీలం మధుతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల పక్షాన నిలిచే పార్టీ అని అన్నారు. దేవుడిపై బిజెపి రాజకీయం చేస్తుందని, దేవుని పేరుతో ఓట్లు దండుకోవాలని చేస్తే ప్రజలు సహించారని విమర్శించారు. పదేండ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం మెదక్‌కు చేసింది ఏమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పరిస్థితి కూడా అందరికి అర్థమైనది అని తెలిపారు. కొండగట్టులో బస్సు బోల్తాపడి ప్రయాణికులు చనిపోతే కనీసం పరామర్శ లేదని, కానీ ఇవ్వాళ మీరు రైతుల గురించి మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో మెదక్ గడ్డ నుంచి నీలం మధును ఎంపీగా గెలిపించి రాహుల్ గాంధీకి బహుమానంగా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనంపల్లి హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు ఆంక్షారెడ్డి, నాయకులు ఎలక్షన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, పిఎసిఎస్ చెర్మన్ నరేందర్ రెడ్డి, ఎంపిపి బాలేశం గౌడ్, పీర్లపల్లి ఎంపిటిసి మహేందర్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్, మైనార్టీ నాయకులు అజీజ్, నాయకులు సుధాకర్ రెడ్డి, కృష్ణ మండల నాయకులు నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతన స్కేళ్లను స్థిరీకరించాలి

- తెలంగాణ నర్సెస్ అసోసియేషన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర నర్సింగ్ ఆఫీసర్ల వేతన స్కేళ్లను స్థిరీకరించాలని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షురాలు జయమ్మ, ప్రధాన కార్యదర్శి మరియమ్మ, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ రుఢావత్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లో పీఆర్సీ చైర్మెన్ శివశంకర్‌ను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. రాష్ట్రంలో నర్సింగ్ ఆఫీసర్లు ప్రధానంగా వైద్యారోగ్యశాఖతో పాటు కార్మిక, సంక్షేమశాఖ (గురుకులాలు) తదితర శాఖల్లో వివిధ హోదాలు, క్యాడర్లలో పని చేస్తున్నారని తెలిపారు. నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు పెరిగాయనీ, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అలవెన్సు పెంచేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆహారోత్పత్తుల పేరుతో తప్పుడు ఔషధాల తయారీ

- డిసిఎ దాడుల్లో వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆహారోత్పత్తుల పేరుతో తప్పుడు ఔషధాలను తయారు చేసి అమ్ముతున్న తయారీదారులపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు దాడులు నిర్వహించారు. మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని ఎమినెంట్ రెమిడీస్, కెన్ క్యూర్ ఫార్మాస్యూటికల్స్‌లో చట్టవిరుద్ధంగా వీటిని తయారు చేస్తున్నట్టు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా మూత్రపిండాల్లో రాళ్లను కరిగించే ఔషధమంటూ తప్పుదారి పట్టిస్తూ అమ్ముతున్న పథార్ చటడీ (స్టోన్ క్రాకర్) ఆయుర్వేద ఔషధాన్ని అదే జిల్లా కెపిహెచ్‌బిలోని ఒక మెడికల్ షాప్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీన్ని రాజస్థాన్ కు చెందిన రాజ్ పుటానా అగ్రికో తయారు చేస్తున్నది. **నకిలీ క్లినిక్‌లపై దాడులు** : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట గ్రామంలో వైద్యం చేసేందుకు అవసరమైన అర్హత లేని జి. శ్రీనివాసులు నడుపుతున్న శ్రీరాం ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై దాడి చేసి 28 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా హైదరాబాద్ జిల్లా ముషీరాబాద్, గాంధీనగర్ , పద్మశాలీ కాలనీలో యునానీ మెడికల్ ప్రాక్టీషనర్ డాక్టర్ అహ్మద్ షాహిద్ వారీస్ వద్ద నిల్వ ఉన్న అల్లోపతిక్ ఔషధాలను గుర్తించారు. అతడి వద్దనున్న 21 రకాల ఔషధాలను సీజ్ చేశారు. లైసెన్స్ లేకుండా డ్రగ్స్ అమ్మడం, అర్హత లేకుండా వైద్యునిగా ప్రాక్టీస్ చేయడం చట్టరీత్యా నేరమని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

కృత్రిమంగా పండ్లను మాగబెడుతున్న వ్యాపారులపై చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) మార్గదర్శకాలకు, నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ కొత్తపేట పండ్ల మార్కెట్లో కొంత మంది అమ్మకందార్లు పండ్లను మాగ పెడుతున్నట్టు టాస్క్ ఫోర్స్ బృందం గుర్తించింది. నిషేధిత పద్ధతిలో మాగ పెడుతున్న 550 కిలోల పండ్ల నిల్వలను వారు సీజ్ చేశారు. అమ్మకందార్లు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలనీ, లేదంటే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడుతున్నట్టు అనుమానం వస్తే 91001 05795కు వాట్సప్ మెసేజ్ చేయాలని ప్రజలకు సూచించారు.

జెఇఇ మెయిన్‌లో వేదాంతుకు పలు ర్యాంకులు

హైదరాబాద్ : జెఇఇ మెయిన్ పరీక్ష ఫలితాల్లో తమ 1,698 మంది విద్యార్థులు అర్హత సాధించారని ఆన్‌లైన్ పోర్టల్ వేదాంతు తెలిపింది. తమ విద్యార్థులలో 210 మంది 99 పర్సంటైల్ కంటే ఎక్కువ స్కోర్ చేశారని, 641 మంది 97 కంటే ఎక్కువ పర్సంటైల్ స్కోర్ చేశారని పేర్కొంది. ముగ్గురు వేదాంతు విద్యార్థులు టాప్ 500లో ఉన్నారని తెలిపింది.

అంబేద్కర్ వర్సిటీ పిహెచ్‌డి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు మే 3

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు వచ్చే నెల మూడో తేదీ వరకు ఉంది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ఎవిఆర్ఎన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి కామర్స్, ఇంగ్లీష్, ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్‌పోర్టల్ www.braou.ac.in లేదా www.braouonline.in ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తు ఫీజు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రూ.వెయ్యి నిర్ణయించామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో డెబిట్/ క్రెడిట్ కార్డ్ ద్వారా లేదా టీఎస్/ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో వచ్చేనెల మూడో తేదీ వరకు చెల్లించాలని కోరారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష అదేనెల 25న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హైదరాబాద్ కేంద్రంలో మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌ను లేదా 040-23680411/498/240 నెంబర్లను సూచించారు.

సెల్‌ఫోన్ ట్యాపింగ్ కేసు

- ముగ్గురు నిందితులకు బెయిల్ నిరాకరణ
- ఈ కేసులో రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయలేదు : సిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ముగ్గురు నిందితులకు నాంపల్లి కోర్టు శుక్రవారం బెయిల్‌ను నిరాకరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ ఈ కేసులో నిందితులైన డిఎస్‌పి ప్రణీత్‌రావు, అదనపు ఎస్‌పిలు బుజంగరావు, ప్రణీత్‌రావు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. కాగా, ఈ కేసులో నిందితులైన ఈ ముగ్గురు అధికారులకు బెయిల్ లభిస్తే వారు సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశమున్నదనీ, అందుకే వీరికి బెయిలివ్వరాదంటూ ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను విన్న న్యాయమూర్తి.. ఈ ముగ్గురు నిందితులకు బెయిల్‌ను నిరాకరిస్తున్నట్టు ఆదేశాలిచ్చారు. కాగా, ఈ కేసులో మరో నిందితుడు నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావు పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై ఈనెల 29న కోర్టు వాదనలను విననున్నది. ఫోన్ ట్యాపింగ్ కేసులో తాము ఇప్పటి వరకు దొరకకుండా ఉన్న నిందితుల కోసం రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్టు కొన్ని పత్రికలు ఇచ్చిన వార్తల్లో నిజం లేదనీ, తాము ఇప్పటి వరకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయలేదని నగర పోలీసు కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు అంశాలు, అరెస్టయినవారి వివరాలను ఎప్పటికప్పుడు తాము పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తున్నామనీ, కేసును పారదర్శకంగా దర్యాప్తు సాగిస్తున్నామని ఆయన వివరించారు. ఇకముందు ఈ కేసులో తేలే దర్యాప్తు అంశాలను బట్టి సంబంధిత నిందితులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమయంలో ఏవేవో ఊహాగానాలు చేస్తూ వార్త రాయటం సరికాదని ఆయన విలేకరులకు సూచించారు.

వరంగల్‌లో కాంగ్రెస్‌కే ఆధిక్యత

- నాడు కల్పనాదేవి.. నేడు కావ్య..
- 40 ఏళ్ల తర్వాత వరంగల్ నుంచి మహిళా నేత పోటీ
- ప్రధాన పార్టీ చాలాకాలం తర్వాత ఇప్పుడే..
- తీవ్రంగా శ్రమిస్తున్న బిఆర్‌ఎస్, బిజెపి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కే ఆధిక్యత కనిపిస్తోంది. 1952లో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 19సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఉప ఎన్నికలు సైతం ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎనిమిది సార్లు, టిడిపి 5, టిఆర్‌ఎస్ 4, టిపిఎస్ 1, పిడిఎఫ్ ఒకసారి విజయం సాధించాయి. ఇప్పుడు జరుగుతున్న తాజా పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో ఉన్న 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉండటం గమనార్హం. దాంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జోష్‌లో ఉన్నాయి. ఇప్పుడు జరగనున్న తాజా పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య, బిఆర్‌ఎస్ అభ్యర్థిగా డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్, బిజెపి అభ్యర్థిగా అరూరి రమేశ్ బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. నియోజకవర్గం లో భారీ మెజార్టీతో గెలవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, ఎట్టి పరిస్థితుల్లో గెలవాలని బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఈ నియోజకవర్గంలో 1984లో మహిళా అభ్యర్థిగా డాక్టర్ కల్పనాదేవి (టిడిపి) మాత్రమే పోటీ చేసి ఎంపిగా విజయం సాధించారు. మళ్లీ చాలా కాలం తర్వాత కాంగ్రెస్ నుంచి డాక్టర్ కడియం కావ్య (కాంగ్రెస్) పోటీ చేస్తున్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 18,16,543 మంది ఓటర్లుండగా, ఇందులో మహిళలు 9,24,205 మంది, పురుషులు 8,91,940 మంది ఉన్నారు. 32 వేల మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే అధికంగా ఉండటం గమనార్హం.వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం చరిత్రను పరిశీలిస్తే ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఎక్కువసార్లు ఈ నియోజకవర్గంలో విజయం సాధించింది. ఈ నియోజకవర్గం లో ప్రస్తుతం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, ఈ ఏడింటిలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా వుండడం గమనార్హం. దీంతో ఈ పార్లమెంటు ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శ్రమిస్తున్నాయి. ఈ పార్లమెంటు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీకి చెందిన రామసహాయం సురేందర్‌రెడ్డి మూడుసార్లు పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు. డోర్నకల్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా సైతం ఎన్నికయ్యారు. టిడిపికి చెందిన అజ్మీరా చందులాల్.. ఎంపిగా రెండుసార్లు, ములుగు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా మూడుసార్లు ఎన్నికై రాష్ట్ర మంత్రిగానూ పనిచేశారు. టిఆర్‌ఎస్‌కు చెందిన పసునూరి దయాకర్ 2015 ఉప ఎన్నికలో రికార్డు మెజార్టీ (4.59 లక్షలు)తో విజయం సాధించారు. 2019లోనూ ఎంపిగా ఎన్నికయ్యారు. 2014లో కడియం శ్రీహరి వరంగల్ ఎంపిగా 3.78లక్షల భారీ మెజార్టీతో విజయం సాధించారు. అనంతరం ఏడాదికే తెలంగాణ రాష్ట్ర కేబినెట్‌లో ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఎంపి పదవికి రాజీనామా చేశారు. దాంతో 2015లో ఉప ఎన్నికలో టిఆర్‌ఎస్ అభ్యర్థి పసునూరి దయాకర్ బరిలోకి దిగి రికార్డు మెజార్టీతో విజయం సాధించారు.

ఏకైక మహిళా ఎంపీగా డాక్టర్ టి కల్పనాదేవి..

1984లో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో ఏకైక మహిళ డాక్టర్ కల్పనాదేవి (టీడీపీ) పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు. హన్మకొండలో ప్రముఖ వైద్యురాలిగా పేరున్న డాక్టర్ కల్పనాదేవి టీడీపీలో చురుకైన నేతగా, సారా వ్యతిరేక ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. కాగా, సుమారు 40 ఏండ్ల తర్వాత మళ్లీ ఓ మహిళ అభ్యర్థి ఎంపీగా పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి డాక్టర్ కడియం కావ్య పోటీ చేస్తుండటం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. వైద్యురాలైన కావ్య వర్ధన్నపేట కేంద్రంలో ప్రభుత్వ వైద్యురాలిగా పని చేసింది. అనంతరం రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తితో ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని రాజకీయారంగేట్రం చేశారు. 'కడియం' ఫౌండేషన్ చైర్మెన్‌గా ఆరోగ్యపరమైన సేవలను స్వచ్ఛందంగా అందిస్తున్నారు. ముఖ్యంగా మహిళలకు ఆరోగ్యంపై అవగాహన పెంపొందిస్తూ, పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులైన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తెగా కడియం కావ్య ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకొని ప్రచారంలో దూసుకుపోతున్నారు.

స్కాలర్‌షిప్‌లతో యుఎస్‌ఎలో బిటెక్ : టిఐఎ

హైదరాబాద్ : స్కాలర్‌షిప్‌లతో అమెరికాలో బిటెక్ చదవడానికి వీలుందని టెక్సాస్ ఇంటర్నేషనల్ అకాడమీ (టిఐఎ) పేర్కొంది. ఇందుకోసం 12వతరగతిపూర్తిచేసిన విద్యార్థులు తమప్రోగ్రామ్‌ను ఎంచుకోవడానికి హైదరాబాద్‌లోని టిఐఎ మద్దతును అందిస్తుందని తెలిపింది. టిఐఎలో 60 శాతం కంటే ఎక్కువ మంది ఔత్సాహిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పది వేల డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ స్కాలర్‌షిప్‌లను పొందారని తెలిపింది.

వినూత్న విధానాలతోనే స్థిరమైన అభివృద్ధి

- అసోచామ్ స్టేట్ హెడ్ దినేష్ బాబు

హైదరాబాద్ : ప్రపంచ ఐపి దినోత్సవం సందర్భంగా టి హబ్, రెసొల్యూట్ 4 ఐపితో కలిసి అసోచామ్ ఓ ప్రత్యేక సెమినార్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా అసోచామ్ ఎపి, తెలంగాణ హెడ్ మచ్చా దినేష్‌బాబు మాట్లాడుతూ..ప్రపంచసవాళ్లను ఎదుర్కొనేందుకు, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి మేధోసంపత్తిని ప్రభావితం చేసే వినూత్న విధానాలు అవసరమన్నారు. ఈ సదస్సులో ప్రణవ గ్రూప్ సిటిఒ రాంబాబు బూరుగు, ఒయు సీనియర్ ప్రొఫెసర్ జిబి రెడ్డి, టిహబ్ సిఇఒ శ్రీనివాస్ మహంకాళి తదితరులు పాల్గొని మాట్లాడారు.

బిజెపికి ఓటు వేయొద్దు

- ఆ పార్టీ ఏ ఒక్క హామీ అమలు చేయలేదు
- పథకాలను సిఎం రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారు
- మాజీ సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"దేశంలో పదేళ్ల బిజెపి పరిపాలనలో ఏ ఒక్క హామీ అమలు చేయలేదు... మాట నిలుపుకోని బిజెపికి మళ్లీ ఎందుకు ఓటేయాలి..? రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారు.." అని మాజీ సిఎం కెసిఆర్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రోడ్ షో అనంతరం క్లాక్ టవర్ దగ్గర కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోడీ కట్టు కథలు.. పిట్టకథలు చెప్పడం తప్ప ఇచ్చిన హామీలు అమలు చేసేది లేదని, పైగా మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భేటీ పడావో భేటీ బచావో అన్నది నినాదం తప్ప కేంద్ర ప్రభుత్వం ఏ ఒక్క బేబీని కాపాడలేదని, చదివించలేదని విమర్శించారు. సబ్కా వికాస్ అనే నినాదం కాగితాలపైనే కానీ పేదల జీవితాల్లోకి తొంగి చూడలేదని అన్నారు. భవిష్యత్ అంతా అమృత్కాలంగా ఉంటుందన్న మోడీ పాలనలో.. పారిశ్రామికవేత్తలకే అమృత కాలంగా మారిందని విమర్శించారు. ఆత్మ నిర్భర భారత్ ఏమైందని ప్రశ్నించారు. ఫసల్ బీమాలో పసలేకుండా పోయిందన్నారు. పథకాలను అమలు చేయకుండా.. ఉన్న వాటిని నిర్వీర్యం చేస్తున్న మోడీకి మూడోసారి ప్రధానిగా ఎందుకు అవకాశం ఇవ్వాలని ప్రశ్నించారు. కేంద్రంలో మోడీ పథకాలు ఇలా ఉంటే.. రాష్ట్రంలో మరోరకంగా రేవంత్ రెడ్డి పరిపాలన కొన సాగిస్తున్నారని విమర్శించారు.

రోడ్‌షోలో మాట్లాడుతున్న కెసిఆర్

అధికారంలోకి రాగానే రైతు భరోసా కింద ఎకరాకు రూ.15000 ఇస్తానన్న రేవంత్‌రెడ్డి ఎందుకు మాట తప్పారని ప్రశ్నించారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని భరోసా ఇచ్చి ఓట్లు దండుకొని గద్దెనెక్కి.. ఇప్పుడు జోగులాంబ సాక్షిగా, దేవుడు సాక్షిగా అంటూ ప్రమాణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. యాసంగికి బోనస్ కాకుండా ఖరీఫ్‌కు ఇస్తామనడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మీటర్లు పెడితే రాష్ట్ర ప్రభుత్వం దానికి వత్తాసు పలికే అవకాశాలు ఉన్నాయన్నారు. కల్యాణ లక్ష్మి, పింఛన్ల పెంపుదల వంటి పథకాల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో మన గొంతును వినిపించే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ లక్ష్మారెడ్డి, నాయకులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, ADAPA E.A.G.RADHA, C/O. ADAPA Suryanarayana Murthy, 8-312/10/5, Plot No. 781/P, Padma Nagar Phase-2, Near Mehar Sai High School, Quthbullapur, VTC Chintal, PO: Hmt Township, Tirumalagiri District, Hyderabad-500054, Telangana State. I have changed my Name from **ADAPA RADHA** (Old name) to **ADAPA E.A.G.RADHA** (New name). Hence here after all my documents and correspondence will be continue with my new name **ADAPA E.A.G.RADHA.**

అధికారంలో ఎవరున్నా..

ప్రజల తరపునే పోరాటం

- ఎన్నికలప్పుడే వచ్చి మాయమాటలు చెప్పే వారిని నమ్మొద్దు
- నిజాయితీగా పని చేసే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలి
- పెద్ద కందుకూరు బహిరంగ సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి
- ఓటు చాలా విలువైనది : ఎండి జహంగీర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలో, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజల కోసం పోరాటం చేసేది ఒక్క సిపిఎం మాత్రమేనని, ఇప్పటికే పోరాటాల ద్వారా అనేక సమస్యలను పరిష్కరించిన చరిత్ర ఎర్రజెండాకి ఉందని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు మాయమాటలతో అనేకమంది వచ్చి ఓట్లు అడుగుతారని.. వారిని నమ్మొద్దని సూచించారు. నికరంగా ప్రజల కోసం నిజాయితీగా పనిచేసే సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ చరిత్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ఎర్రజెండా మాత్రమే ప్రజల సమస్యలపై గళం విప్పుతుందని చెప్పారు. ప్రస్తుత రాజకీయాల్లో ఎవరు ఏ పార్టీలో ఉంటున్నారో అర్థం కావడం లేదన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న పార్టీలు, అభ్యర్థుల చరిత్ర.. సిపిఎం అభ్యర్థి జహంగీర్ ముందు, తమ పార్టీ చరిత్ర ముందు పైసకు పనికిరారని అన్నారు. విలువల్లేని పార్టీలను, విలువల్లేని అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎండి జహంగీర్ మాట్లాడుతూ ఓటు విలువ చాలా ముఖ్యమైనదని, ధనవంతునికైనా పేదవానికైనా ఒకే ఒకటి ఉంటుందని చెప్పారు. ప్రజలందరూ ఆలోచన చేసి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిజెపి ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా ప్రజా వ్యతిరేక తప్పుడు పనులు చేస్తోందని తెలిపారు. ప్రజల మధ్య తగాదాలు సృష్టించి పబ్బం గడుపుతున్న చరిత్ర బిజెపిదని విమర్శించారు. గ్యాస్ ధర, పెట్రోల్ ధరలు పెరగడానికి ఆ పార్టీనే కారణమన్నారు. భువనగిరి పార్లమెంటుకు మూడుసార్లు ఎన్నికలు జరిగితే రెండుసార్లు కాంగ్రెస్, ఒక్కసారి బీఆర్ఎస్ గెలిచిందన్నారు. రెండుసార్లు కాంగ్రెస్ గెలిస్తే ఇద్దరు అన్నదమ్ములే పరిపాలన చేశారన్నారు. వారి పరిపాలనలో భువనగిరి ఏం అభివృద్ధి చెందిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఒకసారి ఎంపీగా పనిచేసిన బూర నర్సయ్యగౌడ్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. ఎన్నికలంటే డబ్బు, మద్యం కాదన్నారు. అందుకే డబ్బు రాజకీయాలను ఓడించాలన్నారు. సమస్త కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడింది ఎర్రజెండా అని, అందుకే ఆ జెండా పట్టుకుని పోటీ చేస్తున్న తనను అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, మంగ నర్సింహులు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్కె లతీఫ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, సిపిఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్ రెడ్డి, నాయకులు షేక్ ఉస్మాన్ షరీఫ్, పెద్దకందుకూరు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో చెరుపల్లి, ఎండి జహంగీర్

'ఫోన్ ట్యాపింగ్' నిందితుల బెయిల్ పిటిషన్లు కొట్టివేసిన కోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగ్గురు నిందితులకు బెయిల్ ఇచ్చేందుకు నాంపల్లి కోర్టు నిరాకరించింది. పోలీసుల వాదనలతో ఏకీభవించిన కోర్టు.. ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని పోలీసులు చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఇదే కేసులో ఏ4గా ఉన్న రాధాకిషన్‌రావు కూడా శుక్రవారం నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రాధాకిషన్‌రావు పిటిషన్‌పై కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించిన కోర్టు.. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

నేటినుంచి జెఇఇ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు

- మే 26న రాతపరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఐఐటిల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) అడ్వాన్స్‌డ్ రాతపరీక్ష వచ్చేనెల 26న జరగనుంది. జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన 2.50 లక్షల మంది అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధించారు. శనివారం నుంచి జెఇఇ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. వాటి సమర్పణకు వచ్చేనెల ఏడో తేదీ వరకు గడువున్నది. జెఇఇ అడ్వాన్స్‌డ్‌ను ఐఐటి మద్రాస్ నిర్వహిస్తున్నది. వచ్చేనెల 17 నుంచి 26 వరకు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అదేనెల 26న ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 రాతపరీక్షలను నిర్వహిస్తారు. జూన్ తొమ్మిదిన జేఈఈ అడ్వాన్స్‌డ్ రాతపరీక్షల ఫలితాలను విడుదల చేస్తారు. అదే తేదీ నుంచి ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎఎటి) కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. జూన్ 12న ఎఎటి రాతపరీక్ష జరుగుతుంది. అదేనెల 15న ఎఎటి ఫలితాలు విడుదలవుతాయి. ఐఐటిల్లో సీట్ల ప్రవేశాల ప్రక్రియ జూన్ 10 నుంచి ప్రారంభమవుతుంది.

125 పట్టణాల్లో విఐటి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్‌లోని 125 పట్టణాలు, విదేశాల్లో ఆరు పట్టణాల్లో విఐటి ఇంజనీరిం ప్రవేశ పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల 19న ప్రారంభమైన ఈ పరీక్షలు 30 వరకు నిర్వహిస్తారు. విదేశాల్లో దుబాయి, మస్కట్, ఖతార్, కువైట్, సింగపూర్, కౌలాలంపూర్‌లో పరీక్ష కేంద్రాలున్నాయి. వచ్చేనెల మూడో తేదీన ఫలితాలను విడుదల చేస్తారు. అదేరోజు నుంచి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. లక్ష ర్యాంకు వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశమున్నది. వచ్చేనెల ఏడు, ఎనిమిది తేదీల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఒకటి నుంచి 20 వేల ర్యాంకుల వారికి, 18,19 తేదీల్లో జరిగే రెండో విడత కౌన్సెలింగ్‌లో 20,001 నుంచి 45 వేల ర్యాంకుల వారికి, అదేనెల 29,30 తేదీల్లో నిర్వహించే మూడో విడత కౌన్సెలింగ్‌లో 45,001 నుంచి 70 వేల ర్యాంకుల వారికి, జూన్ తొమ్మిది, పది తేదీల్లో జరిగే నాలుగో విడత కౌన్సెలింగ్‌లో 70,001 నుంచి లక్షల ర్యాంకుల వారికి ప్రవేశాలను కల్పిస్తారు. లక్ష ఆపైన ర్యాంకుల వారికి విఐటి - ఎపి, విఐటి-భోపాల్‌లో సీట్లు కేటాయిస్తారు. జూన్ 20,21 తేదీల్లో అందుకు సంబంధించిన కౌన్సెలింగ్ జరుగుతుంది. జులై రెండో వారంలో విఐటి ప్రాంగణాల్లో ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభమవుతాయి.

బిజెపి ఓటమి ప్రజాస్వామికవాదుల బాధ్యత

- రాజ్యాంగం పట్ల గౌరవం ఉన్న ప్రతి ఒకరూ బిజెపి ఓటమికి కృషి చేయాలి
- కాంగ్రెస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి
- సామాజిక తరగతులకు అన్యాయం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ
- సిపిఎం కార్యాలయానికొచ్చి మద్దతు కోరిన వంశీచంద్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భావ సారూప్యం కల్గిన పార్టీలు, వ్యక్తులు రాజ్యాంగం పట్ల గౌరవం కల్గిన ప్రతి ఒకరూ బిజెపి ఓటమికి కృషి చేయాలని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. బిజెపి అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో సామాజికంగా ఆర్థికంగా పేదలకు సహాయ సహకారాలు అందలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. సిపిఎం మహబూబ్‌నగర్ జిల్లా కార్యాలయానికి శుక్రవారం చల్లా వంశీచంద్‌రెడ్డి వచ్చారు. నాయకులతో మాట్లాడి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ మద్దతు కోరారు. వామపక్షాలు, దాని ప్రజాసంఘాలు క్షేత్ర స్థాయిలో పనిచేసి కాంగ్రెస్‌ను అత్యధిక మేజార్టీతో గెలిపించాలని వంశీ కోరారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. మతతత్వ బిజెపిని ఓడించడానికి సర్వశక్తులా ప్రయత్నం చేస్తామన్నారు. దేశంలో బిజెపిని నామరూపం లేకుండా చేయాలని, అప్పుడే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందన్నారు. ఇండియా కూటమి ద్వారా దేశ లౌకిక విధానాన్ని కాపాడుకోవాల్సి బాధ్యత మన మీద ఉందన్నారు. రాష్ట్రంలో సిపిఎం బరిలో ఉన్న భువనగిరి తప్ప మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించడానికి తమ పార్టీ శ్రేణులు పనిచేస్తారని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక న్యాయం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, రైతులు, ఉద్యోగులు సమ్మె చేయకుండా చట్టాలు మార్చారన్నారు. కేంద్ర సంస్థల్లో పనిచేసే చిరుద్యోగులకు వేతనాల పెంపు లేకుండా చేయడమేగాక ఉపాధి హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించడానికి ప్రతి ఒకరూ ఐక్యతతో కృషి చేయాలని కోరారు. బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. దేశంలో 24 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, వీటి కోసం 40 కోట్ల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని చెప్పారు. లౌకిక విధానాలకు గొడ్డలిపెట్టుగా మారిన బిజెపిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎ.రాములు, వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్, నారాయణపేట జిల్లా కార్యదర్శి వెంకట్‌రామిరెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, కురుమూర్తి, చంద్రకాంత్, ప్రశాంత్ ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

విద్యార్థులు సమాజ హితం కోసం చదవాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులు సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేయాలని, ప్యాకేజీల కోసం కాకుండా సమాజ హితం కోసం చదవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని నానో కాలేజీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం EAPCET & NEET ప్రశ్న పత్రాల మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. నానో కాలేజ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ హాజరై జ్యూరాజుజు మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. చుక్కారామయ్య సారథ్యంలో 20 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఎంసెట్ మోడల్ పేపర్, నీట్ వచ్చినప్పటి నుంచి ఆ మోడల్ పరీక్ష కూడా పెడుతోందని తెలిపారు.

విద్యార్థుల్లో భయం పోగొట్టడానికి, అలాగే అనుభవం రావడానికి మోడల్ పరీక్షలు నిర్వహించడం మంచి కార్యక్రమం అని అభినందించారు. ప్రతి విద్యార్థి మంచి ర్యాంకు రావాలని, ఉన్నతమైన కళాశాలలో సీటు సంపాదించాలని పోటీపడి పరిగెత్తుతారని తెలిపారు. ఎక్కడ సీటు వచ్చిందన్నది ముఖ్యం కాదని, మనం చదివే ప్రతి విషయంలోనూ సమాజంలో జరిగే మంచి చెడులపై ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి విషయాన్నీ విశ్లేషించడం.. దాన్ని అర్థం చేసుకోవడంతో కొత్త విషయాలను నేర్చుకోవచ్చన్నారు. బట్టీ చదువులు మానుకోవాలని చెప్పారు. ఉత్పత్తులు, వాటి వాడకం, సమాజంలో వాటికున్న లింకులపై ప్రత్యేకంగా చదవాలని, అవి తెలుసుకున్నప్పుడు దేనినైనా సాధించగలరని సూచించారు. కన్న కలలను సాకారం చేసుకోవడానికి శ్రద్ధ పెట్టాలన్నారు. డబ్బుల కోసం కాకుండా సమాజ హితం, అభివృద్ధి కోసం పని చేసినప్పుడే విద్యార్థులు లక్ష్యాలను సాధిస్తారని తెలిపారు.

నానో కాలేజ్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ పోరాటాల్లోనే కాదు విద్యార్థులను చైతన్యవంతులను చేయడంలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. మరెన్నో మంచి కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ ఎల్ మూర్తి, నాగరాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర్ల కిరణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డి, నాయకులు విగ్నేష్, ప్రశాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి సవాల్‌కు సిద్ధం

- అమరవీరుల స్థూపం వద్దకు రాజీనామా లేఖతో రావాలి : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ ఈ ఏడాది ఆగస్టు 15 వరకు అమలు చేస్తే రాజీనామాకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిజమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా పత్రంతో హైదరాబాద్ గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్దకు రావాలని సవాల్ విసిరారు. శుక్రవారం హరీశ్‌రావు తన రాజీనామా లేఖతో అమరవీరుల స్థూపం వద్దకు వచ్చి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరించి తన రాజీనామా పత్రంతో వచ్చానని తెలిపారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేస్తే తన రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇవ్వాలని చెప్పారు. అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి తన రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇవ్వాలన్నారు. రేవంత్ రాలేని పక్షంలో తన సిబ్బందితోనైనా రాజీనామా పత్రాన్ని పంపించాలని సూచించారు. అందరి ముందు ఇద్దరి రాజీనామా పత్రాలను పెడతామన్నారు. రేవంత్‌రెడ్డి రాజీనామాకు ముందుకు రావట్లేదంటే ప్రజలను మోసగించినట్టేనన్నారు. దేవుళ్లపై ప్రమాణాలు చేసి ప్రజలను మోసం చేసేందుకు సీఎం ప్రయత్నిస్తున్నారని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ఇప్పటికే మోసం చేసిందని ఆరోపించారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని మాటిచ్చి తప్పిందని.. సోనియమ్మ మాట అంటూ రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేశారని అన్నారు.

ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, కేపీ వివేకానంద, గోపాల్, బండారి లక్ష్మారెడ్డి అక్కడకు చేరుకుని హరీశ్‌రావుకు మద్దతు తెలిపారు.

అమరవీరుల స్థూపానికి శుద్ధి

స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అమరవీరుల స్థూపాన్ని హరీశ్‌రావు వాడుకుంటున్నారంటూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆధ్వర్యంలో స్థూపాన్ని పసుపునీళ్లతో శుద్ధి చేశారు.

అమరవీరుల స్థూపం వద్ద రాజీనామా లేఖతో హరీశ్‌రావు

ఎస్ఎస్ఎలో ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగుల తొలగింపు

- ఎన్నికల విధుల్లో పాల్గొనాలని ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. సమగ్ర శిక్షలో పాఠశాల స్థాయిలో పనిచేస్తున్న సుమారు 2300 మంది ఒప్పంద ఉపాధ్యాయులను పాఠశాల చివరి పని దినం ఈనెల 23న విధుల నుంచి తొలగిస్తున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే వీరికి ఎన్నికల్లో డ్యూటీ చేయాలని తిరిగి జీఓ జారీ చేయడం విడ్డూరంగా ఉందని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం హన్మకొండ జిల్లా కార్యాలయంలో జరిగిన తెలంగాణ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ స్ట్రగుల్ రాష్ట్ర కమిటీ సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఒప్పంద ఉద్యోగులకు పూర్తిస్థాయిలో 12 నెలలకు నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మాత్రం కేవలం 10 నెలల వేతనాలు ఇచ్చి రెండు నెలల వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగంలో నుంచి టర్మినేషన్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రవీందర్ రాజు మాట్లాడుతూ.. 12 ఏండ్లుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలని, లేకుంటే ఎన్నికల విధులకు హాజరు కామని తేల్చిచెప్పారు. జిల్లా నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ.. ఉద్యోగంలో నుంచి టర్మినేషన్ చేసి ఎన్నికల విధులకు హాజరుకావాలని ఉత్తర్వులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. 12 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ల టర్మినేషన్‌ను ఎత్తివేసి రీ ఎంగేజ్‌మెంట్ ఉత్తర్వులు ఇవ్వాలని, లేని పక్షంలో ఎన్నికల విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఆలెన్ ఫార్మాలో అగ్ని ప్రమాదం

- వెల్డింగ్ పనులు చేస్తుండగా అంటుకున్న మంటలు
- తాడు సాయంతో పలువురిని కాపాడిన యువకుడు
- కొందరికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆలెన్ ఫార్మా పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగింది. పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఓ యువకుడు తాడు సహాయంతో కార్మికులను కాపాడాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మండల కేంద్రంలో గల ఆలెన్ ఫార్మా పరిశ్రమలో కార్మికులు వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న ధర్మకోల్‌పై నిప్పురవ్వలు పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో పరిశ్రమలో సుమారు 150 మంది విధులు నిర్వహిస్తున్నారు. కార్మికులు బయటకు పరిగెత్తుకొచ్చారు. ఐదుగురు కార్మికులు పరిశ్రమ లోపల చిక్కుకుపోవడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే నందిగామ గ్రామానికి చెందిన యువకుడు సాయిచరణ్ తాడు సహాయంతో పరిశ్రమ కిటికీ నుంచి లోపలికి వెళ్లి వారిని కిందకి తీసుకొచ్చాడు. వారికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆరు ఫైర్ ఇంజిన్లతోపాటు స్థానిక వాటర్ ట్యాంకుల సహాయంతో మంటలను ఆర్పుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలుగా శ్రమిస్తున్నా మంటలు ఇంకా పూర్తిగా చల్లారలేదు. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

సాయిచరణ్‌ను అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డిసిపి నారాయణరెడ్డి

అగ్ని ప్రమాదం సమయంలో ధైర్య సహసాలతో పరిశ్రమ భవనంపైకి వెళ్లి తాడు సాయంతో పలువురు కార్మికుల ప్రాణం కాపాడిన యువకుడు సాయిచరణ్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డిసిపి నారాయణరెడ్డి, అడిషనల్ డిసిపి రామ్‌కుమార్, ఆర్డీఓ, తహసీల్దార్ రాజేశ్వర్, పోలీస్ అధికారులు, స్థానికులు అభినందించారు. పోలీసులు ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. విచారణ చేపట్టిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఎన్నికేదైనా జెండా సిరిసిల్లదే..

- పార్లమెంట్ ఎన్నికలకు ఆర్డర్లు.. ఫుల్
- నేత కార్మికులకు చేతినిండా పని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఎక్కడ ఎన్నికల జరిగినా అక్కడ సిరిసిల్ల జెండా ఎగరాల్సిందే. సిరిసిల్ల నేతన్నల నైపుణ్యాన్ని మెచ్చిన రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి రాజకీయ పార్టీలు తమ ప్రచార జెండాలు, కండువాలు, ఇతర వస్త్ర సామాగ్రి ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు ఇస్తున్నారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిరిసిల్ల నేతన్నలకు మెండుగా ఉపాధి లభిస్తోంది. తెల్లని వస్త్రాన్ని ఉత్పత్తి చేసి దానిపై వివిధ పార్టీలకు చెందిన నాయకుల ఫొటోలు, గుర్తులు, పార్టీలకు సంబంధించిన కలర్స్‌తో పూర్తి స్థాయి జెండాలు, కండువాలు తయారవుతున్నాయి. తక్కువ ధరలకే ఎన్నికల ప్రచార సామాగ్రిని సరఫరా చేస్తూ జాతీయ స్థాయి పార్టీల చూపు సిరిసిల్ల వైపు చూసేలా చేస్తున్నారు నేతన్నలు. కార్మికులకు ఎలక్షన్ సందడితో చేతినిండా పని దొరుకుతోంది.

తెలుగు రాష్ట్రాల ఆర్డర్లు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీల ఆర్డర్లు సిరిసిల్ల నేతన్నలకు ఇప్పటికే అందాయి. ఆ మేరకు కార్మికులు ఉత్పత్తి ప్రారంభించారు. పార్టీ జెండా తయారీకి మీటరున్నర వస్త్రం, కండువా తయారీకి మీటర్ వస్త్రాన్ని వాడుతున్నారు. వివిధ పార్టీలు ఆర్డర్‌లను బట్టి జెండాలను, కండువాలను తయారు చేస్తున్నారు. ఇప్పటికే అధికారపార్టీ కాంగ్రెస్ 5లక్షల మీటర్ల ఆర్డర్‌లను ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతుండటంతో అధికారపార్టీ అయినా వైసిపి రూ.5లక్షల మీటర్ల ఆర్డర్ ఇచ్చింది. మిగతా రాజకీయ పార్టీలు కూడా ఆర్డర్లను ఇచ్చాయి. ప్రస్తుతానికి జెండాలు, కండువాలను తయారు చేస్తున్నారు. జెండాలు తయారు చేసే నేతన్నలు రూ.9 చొప్పున మీటరు వస్త్రాన్ని కొనుగోలు చేస్తారు. దీనికి ప్రింటింగ్ కోసం రూ.8 ఖర్చవుతుంది. ఒక జెండా తయారీకి రూ.17 ఖర్చవుతుంది. ఉత్పత్తిదారులు ఈ జెండాలను రూ.19నుంచి రూ.20 విక్రయిస్తున్నారు.

నేత కార్మికులకు ఉపాధి ..

ప్రస్తుతం జెండాల ఉత్పత్తిలో సిరిసిల్లలో దాదాపు 1500మంది నేత కార్మికులు ఉపాధి పొందుతున్నారు. జెండా కట్ చేస్తే ఒక్కో జెండాకు 25పైసలు, కుట్టిస్తే 40పైసలు చొప్పున ఇస్తారు. జెండాల తయారీ కార్ఖానాలో జెండాలను కట్ చేస్తూ స్థానికులు, కుట్టు పని చేస్తూ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇంకా ఆర్డర్‌లు పెరిగితే ఈ ఉపాధి పెరుగనుంది. రాజకీయ పార్టీల తమ అభ్యర్థులను పూర్తిగా ప్రకటిస్తే మరిన్ని ఆర్డర్లు పెరుగుతాయిని ఉత్పత్తిదారులు చెబుతున్నారు.

రెండు రాష్ట్రాలకు సిరిసిల్ల నుంచే..

సిరిసిల్లలో తయారైన వివిధ పార్టీల జెండాలను రెండు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. తెలంగాణలోని ఇతర జిల్లాలకు చెందిన ప్రింటింగ్ వ్యాపారస్తులు ఎంపీ అభ్యర్థుల ఆర్డర్‌లు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఆర్డర్లు తీసుకుని సిరిసిల్లలో ఇస్తుంటారు. నేరుగా అభ్యర్థులతోకాక మధ్యవర్తులతో కూడా కొన్ని ఆర్డర్లు లభిస్తాయి. ప్రధానంగా ఉమ్మడి రాష్ట్రంలో చూసుకుంటే ఒక్క సిరిసిల్లలోనే జెండాలు తయారవుతున్నాయి.